క్లుప్తంగా

వటపత్రసాయి అలంకారంలో శ్రీవారు



మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు వటపత్రసాయి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవానికి ఆస్థాన అలంకార ఉత్సవానికి కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్ళచెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించగా ఉత్సవాన్ని ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల విశ్వభారతి ఫార్మసీ కళాశాలలో శనివారం శ్రమదానం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీల్, డాక్టర్ జి.నవీన్ బాబు, శిరీష, రమేష్, పేరేచర్ల గ్రామ సర్పంచి దేవరకొండ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు జిల్లా మహిళల వాలీబాల్ జట్టుకు సత్కారం

తెనాలి: పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో ఇటీవల జరిగిన సీనియర్‌అంతర జిల్లాల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచిన గుంటూరు జిల్లా మహిళల వాలీబాల్ జట్టు క్రీడాకారులకు ఆదివారం తెనాలిలో సత్కారం జరగనుంది. గుంటూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ఇక్కడి అమరావతి కాలనీలో గల అన్నాబత్తుని సత్యనారాయణ క్రీడాస్టేడియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాకు చెందిన మహిళా వాలీబాల్ క్రీడాకారులు ఉన్నతస్థాయిల్లో ఆడుతున్నప్పటికీ, రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా మహిళల జట్టు టీమ్ ఛాంపియన్‌షిప్‌ను సాధించటం ఇదే తొలిసారి. ఈ విజయాన్ని సాధించిపెట్టిన జట్టును అసోసియేషన్ తరపున సత్కరించటం ప్రోత్సాహకరంగా ఉంటుందని ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు కార్యదర్శి ఎస్.నిరంజనరావు తెలియజేశారు. రాష్ట్ర విజేతగా నిలిచిన జట్టులో జిల్లా వాలీబాల్ క్రీడాకారిణులు ఎస్.మౌనిక, ఏవీఎస్ పార్వతి, ఎ.మానస, టి.లక్ష్మీసాయిదుర్గ, ఎం.యామిని, బి.ఆషా, ఎం.జ్యోత్స్న, ఎం.సుమశ్రీ, పి.షహీద, టి.పల్లవి సాయిశ్రీ, ఎస్.సువర్ణ, వి.సుప్రియ ఉన్నారు. కోచ్‌గా కె.కోటేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్‌గా బీఎల్ కాంతమ్మ వ్యవహరించినట్టు నిరంజనరావు వివరించారు.

భవిష్యత్ అంచనాలకు చరిత్ర దోహదం: వీసీ



ఏఎన్‌యూ: భవిష్యత్ అంచనాలకు చరిత్ర దోహదం చేస్తుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. నాగార్జున యూనివర్సిటీ హిస్టరీ, ఆర్కియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ద ప్రీ హిస్టారిక్ రీసెర్చ్ ఇన్ ఇండియా' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శనివారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ చరిత్ర అధ్యయనం వర్తమాన సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. యువత భవిత, మేలైన నడతకు చరిత్ర దోహదం చేస్తుందన్నారు. బ్రిటిష్ వాళ్లు వచ్చే వరకూ భారతీయులకు దేశం అంతా ఒక్కటే అనే భావన లేదని, వాళ్లు వచ్చి మన దేశ చరిత్రను అధ్యయనం చేసిన తర్వాత మాత్రమే భారతీయులకు చరిత్ర ప్రాముఖ్యత తెలిసిందని తెలిపారు. ఆర్కియాలజీ రంగానికి ఆర్ట్స్ కంటే సైన్స్‌తో ఎక్కువ సంబంధం ఉందని చెప్పారు. రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి ప్రసంగిస్తూ చరిత్ర అతి ముఖ్యమైందన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయ ప్రతినిధి ఆచార్య ఎస్.చంద్రమౌళి ప్రసంగిస్తూ ప్రపంచంలో ప్రీ హిస్టరీ అనేది సైన్స్‌తో సంబంధించిన అంశమని తెలిపారు. ఏఎన్‌యూలో ఎంఏ ఆర్కియాలజీ చదవడం ద్వారా అనేక విషయాలు నేర్చుకున్నానన్నారు. కర్ణాటక విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఆచార్య రవీంద్ర కొరిసెట్టర్ కీలకోపన్యాసం చేస్తూ చరిత్రతో పాటు మన దేశంలో చారిత్రాత్మక ప్రాంతాలకు ఎంతో విశిష్టత ఉందని వివరించారు. దాన్ని భావితరాలకు పదిలంగా అందజేయాల్సిన బాధ్యత హిస్టరీ, ఆర్కియాలజీ రంగ నిపుణులపై ఉందని సూచించారు. కార్యక్రమంలో సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల సైక్రియాటిక్ విభాగ అధ్యాపకుడు ఫణిభూషణ్ తెలిపారు. ఏఎన్‌యూ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి నిర్మూలనా విధానాలు' అనే అంశంపై ఏఎన్‌యూ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది.

'ఫ్యామిలీ డాక్టర్' దేశ చరిత్రలో నూతన అధ్యాయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి



వైద్య పరీక్షల అనంతరం రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

లింగాయపాలెం(తాడికొండ): ఫ్యామిలీ డాక్టర్ పథకం దేశ చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శనివారం తుళ్లూరు మండలం లింగాయపాలెంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ పథకం సేవలను పరిశీలించారు. అందిస్తున్న సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు స్వయంగా పరీక్షలు చేశారు. ప్రభుత్వం అందించిన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే కృత నిశ్చయంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంతూరిలో వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ పథకం దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించిందని కొనియాడారు. వైద్య రంగానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగా అనేక పీహెచ్‌సీలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే భవనాలకు నిధులు కేటాయించినట్లు వివరించారు. అలాగే అరుదైన వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చడం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని వివరించారు. అదే విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా పీహెచ్‌సీల్లో పనిచేసే ఇద్దరు వైద్యులను ఆ పరిధిలో ఉన్న సచివాలయాలకు కేటాయిస్తారని వివరించారు. ఒక వైద్యుడు పీహెచ్‌సీలో ఉంటే మరో వైద్యుడు 104 వాహనంతో గ్రామాలకు వెళ్లి సేవలందించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

ఇంటింటికి సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- వెలగపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం
- హాజరైన పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి



వెలగపూడిలో అవగాహన కల్పిస్తున్న కత్తెర సురేష్ కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

వెలగపూడి(తాడికొండ): ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. తుళ్లూరు మండలం వెలగపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం వారు ఇంటింటికీ తిరిగి సంక్షేమాన్ని వివరించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే 2024 ఎన్నికల్లో 175 సీట్లకు 175 విజయం సాధించడం సుసాధ్యమే అన్నారు. ప్రధానంగా ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య జఠిలంగా ఉందని వివరించగా స్పందించిన కత్తెర సురేష్ కుమార్ సీఆర్డీయే అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ఎమ్మెల్యే ఆర్కే



ఆర్థిక సాయం అందజేస్తున్న దుగ్గిరాల ఎంపీపీ సంతోషరూపవాణి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే అండగా నిలుస్తున్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామానికి చెందిన షేక్ బీబీజాన్, నెమలికంటి ప్రకాష్, అద్దంకి వెంకటేశ్వర్లు, మేకల నల్లబ్బాయి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి వ్యాపారానికి తోడ్పాటును అందించేందుకు శనివారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా వారికి తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, షేక్ జానీ, షేక్ సుభాని, తురకా మోహన్‌దాస్, నెమలికంటి బాబూరావు, జంషాద్ ఖాన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని నల్లమేకలవారిపాలేనికి చెందిన వృద్ధురాలు తుల్లిమిల్లి భద్రమ్మ ఇటీవల అనారోగ్యం పాలై ఇబ్బంది పడుతున్న కారణంగా బాధితురాలికి రూ.20 వేలు, ఇదే గ్రామానికి చెందిన మహిళ కాజ నాగమ్మ ఇటీవల శస్త్రచికిత్స జరిగి కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మరో 20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తె ఆనంద్, జమ్ముల లోకేష్, షేక్‌జానీ బాషా, వడ్డేశ్వరపు రజనీకాంత్, మేరుగ ఆనంద్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో నిర్వహించిన రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసీ, ఓడ రేవులు, విమానాశ్రయాలు మొదలైన వాటిని కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు, అదానీలకు, కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు తెచ్చిన నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు పూనుకుందని ఆరోపించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాల స్థానంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రతి ఘటనలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, దొంతిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, దొంతిరెడ్డి బుల్లికోటిరెడ్డి, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, సిహెచ్ లక్ష్మారెడ్డి, మేకా అమరారెడ్డి పాల్గొన్నారు.

పెనుమాకలో పైప్‌లైన్ పనులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు కార్పొరేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం కొత్తూరు సెంటర్ నుంచి కొండ పైప్రాంతానికి రూ.10 లక్షలతో తాగునీటి పైపు లైను ఏర్పాటు చేస్తున్నారు.

బావిపై ఐరన్ గ్రిల్ ఏర్పాటు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో ముస్లిం బజారులో ఉన్న బావిపై శనివారం అధికారులు ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. సుమారు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ బావి ప్రస్తుతం వినియోగంలో లేదు. కొంతమంది మోటార్ల ద్వారా ఈ నీటిని ఉపయోగించుకుంటున్నారు. స్థానిక చిన్నారులు ఆ బావిలో చెత్తాచెదారం వేయడంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఎమ్మెల్యే ఆర్కే పర్యటించిన సందర్భంలో స్థానికులు పూడిక తీయించి గ్రిల్ ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన ఆయన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించి బావిపై ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు.

సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు

ఫిరంగిపురం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు శనివారం చేపట్టారు. అల్లంవారిపాలెం, తూర్పుబజార్ నవ భారత్ రెసిడెన్సీ వరకు, పెట్రోలు బంకు వద్ద నుంచి రేపూడి గ్రామశివారు వరకు చెట్లుకొమ్మలు తొలగించినట్లు ఏఈ పుల్లారెడ్డి తెలిపారు.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన

ఫిరంగిపురం: స్థానిక దక్షిణా ముఖ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే స్వామికి అర్చకులు నారాయణం వంశీకృష్ణ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్త ర, సహస్రనామ పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మంగళగిరి చేరుకున్న ఎమ్మార్పీఎస్ పాదయాత్ర



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద కరపత్రాలు ప్రదర్శిస్తున్న పాదయాత్ర బృందం

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలని వచ్చే పార్లమెంట్ సమావేశాలలో బిల్లు ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఈనెల 27వ తేదీ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టగా ఈ నెల 24వ తేదీన పొన్నూరు మండలం నిడుబ్రోలు నుంచి ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం రాత్రి మంగళగిరి చేరింది. శనివారం మంగళగిరిలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమై నిడమర్రు, కురగల్లు, ఐనవోలు మీదుగా పెదపరిమి చేరింది. పాదయాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు వేమూరి సుధాకర్, కూచిపూడి సత్యం, కలకోటి నాగేశ్వరరావు, పులివర్తి నథానియేల్, ఇందుపల్లి రామారావు, చందోల్ విక్టర్‌పాల్, వాణి, ఉండిమెడ నాగేంద్రం పాల్గొన్నారు.

రత్నాల చెరువు రోడ్డు నిర్మాణ పనులు



పనులు ప్రారంభించిన రత్నాలచెరువు ప్రధాన రహదారి నిర్మాణ పనులు

మంగళగిరి: నగరంలోని రత్నాల చెరువు రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బీటీ రోడ్డు నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన సమయంలో స్థానికులు పలువురు రోడ్డు నిర్మించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. 5 మీటర్ల వెడల్పుతో 1.02 కిలోమీటర్లు రోడ్డు రత్నాల చెరువులోని వాటర్ ప్లాంట్ వద్ద నుంచి ప్రారంభమై లక్ష్మీనృసింహస్వామి కాలని వద్ద ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మీదుగా జాతీయరహదారిని కలిపేలా రోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ.1.50 కోట్లతో శనివారం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేదా హనుమంతరావు



తాడికొండ బస్టాండ్ వద్ద ప్రదర్శన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తాడికొండ: కేంద్రం ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ మేదా హనుమంతరావు అన్నారు. తాడికొండలో నిర్వహించిన ఏఐటీయూసీ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి మార్కెట్ యార్డు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరుతో ఉద్యోగాలు భర్తీ చేయడం తగదని, పర్మినెంట్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని, ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, ఏరియా అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ, నాయకులు గుర్రంకొండ సత్యానందం, చింతల భాస్కరరావు, వ్యకాస కార్మిక సంఘం నాయకులు కంభంపాటి దేవుని దయ పాల్గొన్నారు. ఏఐటీయూసీ తాడికొండ ఏరియా అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ నాగుల్ మీరా, జీవీ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటుగా మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.పలువురు కార్మికులు, ఏఐటియూసీ నాయకులు అభినందించారు.

కేఎల్‌యూలో విద్యార్థులకు అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో కుంచనపల్లి, వడ్డేశ్వరం పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఓటీ విభాగ అధిపతి డాక్టర్ పి.సత్యనారాయణ మాట్లాడుతూ రిమోట్‌తో కారును అదుపు చేయడం, డ్రైవర్ లేకుండానే నాలుగు చక్రాల వాహనాలు నడపడం, ఏదైనా వస్తువు అడ్డుగా వచ్చిన సందర్భంలో వాహనాలు వాటంతట అవే తనను తాను నియంత్రించుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించామని అన్నారు. ఐఓటీలో చేపట్టిన పలు ఆసక్తికరమైన ప్రయోగాల వల్ల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించామని అన్నారు. తమ విశ్వవిద్యాలయంలో ఐఓటీ విభాగంలో చదువుతున్న విద్యార్థులు చెక్కలు, పలు రకాల బోర్డుల సహాయంతో రూపొందించిన రిమోట్ కారు తయారీ గురించి విద్యార్థులకు వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, స్కిల్ అభివృద్ధి డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వరరావు, ఫణి, వాసు, ప్రకాష్‌రావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

14న పునీత ఆంథోని ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రాజాపేట వద్ద పునీత ఆంథోని ఆలయ వార్షికోత్సవం ఈనెల 14వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు మున్నంగి జోజప్ప శనివారం తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ వద్ద ఏర్పాటుచేసిన వేదికపై బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి ఆధ్వర్యంలో దివ్యపూజాబలి నిర్వహించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పేరేచర్ల ఆపిల్ హైస్కూల్ నాలెడ్జ్ కార్నివాల్-2023

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల యాపిల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నాలెడ్జి కార్నివాల్ -2023 ఆదివారం నిర్వహించనున్నట్లు హైస్కూల్ ప్రిన్సిపాల్ మోరపాకుల అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం యాపిల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమాజానికి, దేశానికి ఉపయోగ పడే విధమైన కొత్త ఎక్స్‌పర్ మెంట్లతో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

విలువలతో కూడిన విద్యతో ప్రగతి

తెనాలి: ప్రైవేటురంగంలో విద్య, వైద్యం వ్యాపారంగా మారిన నేటి కాలంలో విద్యార్థులు డిగ్రీలు సాధిస్తున్నా మానవతా విలువలు పాటించకపోవటం కుటుంబ, సామాజిక సమస్యగా మారిందని పారిశ్రామికవేత్త నంబూరి వెంకట కృష్ణమూర్తి అన్నారు. విద్యాసంస్థలు, విద్యార్థులు విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆడిటోరియంలో శనివారం వివేక ఫాస్టర్ స్కూలు విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణమూర్తి ప్రైమరీ క్లాస్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. విశిష్ట అతిథి స్వామి భాస్కరానంద సరస్వతి ప్రవచిస్తూ, పిల్లల చదువు, సంస్కారం, క్రమశిక్షణపై తల్లిదండ్రులు పరిశీలన చేస్తూ లోపాలను సవరిస్తుండాలని సూచించారు. వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో వందలాది చిన్నారులు ప్రత్యేక దుస్తులు, టోపీలు ధరించి పట్టాలను అందుకున్నారు. అతిథులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

హత్యాయత్నం కేసులో స్నేహితుడే నిందితుడు

- తను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నాడనే ఘాతుకం!
- మరో ఇద్దరితో కలసి కుట్ర

తెనాలి రూరల్: తెనాలిలో ప్రైవేటు ఉపాధ్యాయుడిపై శుక్రవారం రాత్రి హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. అయితే తాను ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకున్నాడన్న కారణంతో అతని మిత్రులే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తోంది. క్షతగాత్రుడు పల్లపురం గణేష్‌బాబు గతంలో నందులపేటలో నివసించేవాడు. అదే ప్రాంతానికి చెందిన బాషా, బాబి, అరవింద్ ఇతర యువకులు గణేష్ బాబుకు మిత్రులుగా ఉండేవారు. వీరిలో బాషా నందులపేటకు చెందిన యువతిని ప్రేమించేవాడు. 2018 డిసెంబర్‌లో ఫొటోగ్రాఫర్ రబ్బాని, మరో యువకుడిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు. ఈ కేసులో జైలుకు వెళ్లగా అతడు ప్రేమించిన వ్యక్తి గణేష్‌బాబుకు దగ్గరైంది. ఇద్దరూ గతేడాది వివాహం చేసుకున్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గణేష్‌బాబు ప్రస్తుతం నాజరుపేటలో నివసిస్తున్నాడు. పాఠశాల అనంతరం ఇంటివద్ద విద్యార్థులకు ట్యూషన్‌లు చెప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి బాషా, బాబి, అరవింద్ నాజరుపేటలోని గణేష్‌బాబు ఇంటికి వెళ్లి అతడిని బయటకు వెళదామని పిలిచారు. వారి వెంట మరో బుల్లెట్‌పై నందులపేట వెళ్లగా అక్కడ బాషా, మిగిలిన ఇద్దరూ కత్తితో గణేష్‌బాబు గొంతు కోసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కత్తితో దాడి అనంతరం బుల్లెట్‌పై ఎక్కించుకుని మరో ప్రాంతానికి తీసుకెళుతుండగా, గణేష్‌బాబు వాహనం నుంచి దూకి వారి నుంచి తప్పించుకుని నెహ్రూ రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చేరాడు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు పంపారు. గణేష్‌బాబు నివసించేది వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో, అతడిపై కత్తితో దాడి జరిగింది టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ప్రాంతాలనూ వన్‌టౌన్, టూ టౌన్ సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు పరిశీలించారు. టూ టౌన్ పరిధిలో ఘటన జరగడంతో ఆ పోలీసులే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు బాష, మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లనూ పోలీసులు పరిశీలించి సాక్ష్యాలను సేకరించినట్టు తెలిసింది. తాను ప్రేమించిన యువతిని వివాహం చేసుకున్నాడన్న కారణంతో బాషా, మిత్రులతో కలసి ఘాతుకానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

మంగళగిరి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం పారా మెడికల్ వలంటీర్లు నగర పరిధిలోని యర్రబాలెం అంబటినగర్‌లో ఇంటింటికి తిరిగి మహిళా సాధికారత గురించి వివరించారు. పారా మెడికల్ వలంటీర్లు మల్లవరపు రామ్మూర్తి, శ్రీనివాసరావు, నరసయ్య పాల్గొన్నారు.